క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాల పంపిణీ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కసాబ్‌గల్లీలో ఆర్యసమాజం–ఇందూరు దయానంద మార్గం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు భగవద్గీత పుస్తకాలను జీజీ కళాశాల విశ్రాంత ఆచార్యులు సేర్ల దయానంద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరిపె సూర్యప్రకాష్, ధనాల కోటి వెంకటనర్సయ్య, ఆచార్య వేదమిత్ర, సురేఖ, చౌటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

ఇందల్వాయి: మండలంలోని స్టేషన్ తండా నుంచి నల్లవెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో కొత్త కాలువపై ఉన్న కల్వర్టు మరమ్మతులకు పంచాయతీ రాజ్ నిధుల నుంచి రూ.2 లక్షల నిధులు మంజూరైనట్లు వైస్ ఎంపీపీ అంజయ్య గురువారం తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు

సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలను గురువారం నిర్వహించారు. డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్‌జాడే మాట్లాడుతు విద్యుత్ ప్రసారంలో ఏదైనా అంతరాయం కలిగితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలి కాని వినియోగదారులు మరమ్మతులు చేసే ప్రయత్నం చేయవద్దన్నారు. భద్రతకు సంబంధించిన సూచనలతో రూపొందించిన వాల్ పోస్టర్లను డీఈ ఆవిష్కరించారు. ఏడీఈ శ్రీనివాస్, గడ్కోల్ సిరికొండ ఏఈలు శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టౌన్‌-2 ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ భద్రతా వారోత్సవాలపై నగర టౌన్‌-2 ఏడీఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులకు, వినియోగదారులకు విద్యుత్ భద్రత వారోత్సవాలపై క్షుణ్ణంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు.

సిరి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నగరంలోని శ్రీనగర్ కాలనీ చౌరస్తా సమీపంలో సిరి ఫిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్) ప్రారంభమైంది. బంక్‌ను ఇండియన్ ఆయిల్ డివిజినల్ రిటైల్ హెడ్ రోషన్ సవయి ప్రారంభించారు. వాహనదారుల సౌకర్యం కోసం ఈ ప్రాంతంలో బంక్ ఏర్పాటు చేసిన యజమాని హారతిను పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు ధర్మపురి సురేందర్‌లు అభినందించారు. సంస్థ సీనియర్ మేనేజర్ మోహన్ కిషోర్, రాహుల్ పాల్గొన్నారు.

ఆవు దూడను కాపాడిన హిందూ ఐక్యవేదిక



సుభాష్‌నగర్: నగరంలోని దేవి థియేటర్ మంగమ్మ గుడి వద్ద డ్రెయినేజీలో పడిన ఆవు దూడను హిందూ ఐక్యవేదిక కన్వీనర్ ధాత్రిక రమేష్ ఆధ్వర్యంలో గురువారం కాపాడారు. దూడ పడిపోవడంతో మున్సిపల్ జవాన్ సమాచారమిచ్చాడని, వెంటనే యువకులతో కలిసి ప్రాణాలు కాపాడామని తెలిపారు.

ఫోన్ రికవరీ

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌కి చెందిన సోనీ అనే మహిళ మే 1న తన మొబైల్ ఫోన్ పోయిందని 3వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆ వివరాల ప్రకారం సీఐఈఆర్ పోర్టల్‌లో ఎంట్రీ చేయగా పోలీసులు మొబైల్ ఫోన్‌ని రెండు రోజుల్లో ట్రాక్ చేసి రికవరీ చేశారు. గురువారం ఫిర్యాదుదారుకు ఎస్సై అప్పగించారు.

న్యాయం చేయాలి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని అహ్మద్ పూర్‌కాలనీకి చెందిన రెండు దుకాణాల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ట్రేడ్‌లైసెన్సు ఇచ్చి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎండీ ఫారుఖ్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఒక వ్యాపారికి ట్రేడ్ లైసెన్సు పొందాలంటే మడిగె ఓనర్‌తో రెంటల్ డీడ్, లీజ్ డీడ్ సమర్పించాలన్నారు. ఇవేమీ లేకున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ట్రేడ్ లైసెన్సు జారీ చేశారని, ఈ విషయంలో చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలన్నారు.

సీపీఎల్ విజేత రాజు టీం

నిజామాబాద్‌నాగారం: ఇందూర్ అన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజారాం స్టేడియం లో నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్(సీపీఎల్)లో గురువారం రాజు టీం, వినయ్ టీంలు తలపడ్డాయి. ఇందులో రాజు టీం విజయం సాధించింది. విన్నర్ టీమ్‌కు షీల్డ్, రూ.22,222, రన్నర్ టీమ్‌కు రూ.11,111 నగదును అసోసియేషన్ అధ్యక్షులు తర్ల కీర్తి కుమార్ అందజేశారు.

నిరుపయోగంగా రైతు బజార్లు

- రెండే కూరగాయల దుకాణాలు
- రోడ్లపైనే విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



ఖాళీగా ఉన్న మటన్, చికెన్ సెంటర్లు



పులాంగ్ రైతు బజార్‌లో కూరగాయలు అమ్ముతున్న ఇద్దరు మహిళలు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన రైతు బజార్లు నిజామాబాద్ నగరంలో నిరుపయోగంగా మారుతున్నాయి. నగరంలోని పులాంగ్ వద్ద ఉన్న రైతు బజార్, వీక్లీ మార్కెట్‌లో డీఎస్ మార్కెట్, సుభాష్‌నగర్‌లోని రైతుబజార్‌లను నిర్మించి అక్కడ ప్రజలకు కూరగాయలు, చికెన్, మటన్, ఫిష్ సెంటర్‌లను అందుబాటులో ఉంచడానికి ఏర్పాటు చేశారు. ఈ రైతు బజార్లు కొన్ని రోజులు పని చేసిన తర్వాత ఇప్పుడు నిరుపయోగంగా మారిపోయాయి. తాజాగా ఖలీల్‌వాడిలో నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయడంతో నిధులను వృథా చేస్తున్నారని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ రైతు బజారులో ఇద్దరు లేదా ముగ్గురు కూరగాయాలు అమ్మకాలు సాగిస్తున్నారు. వీక్లీ మార్కెట్‌లో రోడ్డుపైనే అమ్మకాలు సాగిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

నగరంలోని ఏర్పాటు చేసిన రైతు బజార్లలోనే అమ్మకాలు సాగిస్తే ప్రజలకు అన్ని రకాల వస్తువులు అక్కడే లభించే అవకాశాలు ఉంటాయి. రోడ్లపైనే అమ్మకాలు సాగిస్తే వాహనాదారులు, పాదచారులకు ఇబ్బందులు ఏర్పడుతాయి. వీక్లీ మార్కెట్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

రైతుబజార్‌లోకి ఎవరూ రావడం లేదు



పదిహేళ్ల నుంచి కూరగాయలు అమ్ముతున్నాను. మొదట్లో కూరగాయాల వ్యాపారం బాగా నడిచింది. ఇప్పుడు రైతుబజార్‌లోకి ఎవరూ రావడం లేదు. ఇద్దరు, ముగ్గురు మాత్రమే వస్తున్నారు. రైతు బజార్‌లోనే అధికారులు అమ్మకాలు సాగేలా చర్యలు తీసుకోవాలి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులుండవు.

– లక్ష్మీబాయి,
కూరగాయల వ్యాపారి, నగరవాసి

విపక్షాలవి అసత్య ఆరోపణలు



చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీలు జగన్, మాన్‌సింగ్

సిరికొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక జెడ్పీటీసీ మాన్‌సింగ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అతని కుటుంబ సభ్యులపై అసత్యప్రచారాలు చేస్తున్న బీజేపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నీరడి పద్మారావు పేర్కొన్నారు. గురువారం డిచ్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి బీజేపీ నాయకులకు లేదన్నారు. ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబసభ్యులపై విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. సర్పంచ్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం తొలగింపు యత్నాలు మానుకోవాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు కోటేశ్వర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించేందుకు కొందరు దళిత దొరలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని అంబేద్కర్ యువ జన సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వర్ హితవుపలికారు. గురువారం మోపాల్‌లో ఆయన మాట్లాడారు. భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అంబేద్కర్‌ను పూజించాలనుకునే వారు నగరంలోనే మరో చోట భారీ విగ్రహాన్ని ప్రతిష్టించాలని సూచించారు. కానీ ఉన్న విగ్రహాన్ని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.

సగం మంది ప్రజాప్రతినిధుల గైర్హాజరు



ఇందల్వాయి: ఇందల్వాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రమేష్ నాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి 23 మంది సర్పంచ్‌లు, 11 మంది ఎంపీటీసీలకుగాను సగం మంది కూడా హాజరు కాకపోవడం గమనర్హం. ప్రజా సమస్యలపై అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. విద్యుత్ అధికారుల తీరు బాగా లేదని సర్పంచ్‌లు విమర్శించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు కచ్చితంగా సేకరించి ప్రభుత్వానికి పంపాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ రమేష్ నాయక్ అన్నారు. ఎంపీడీవో రాములు నాయక్, వైస్ ఎంపీపీ అంజయ్య, తహసీల్దార్ రోజా, తదితరులున్నారు.

నిండా ముంచిన అకాల వర్షాలు

అన్నదాతను అకాల వర్షాలు నట్టేట ముంచాయి. చేతికి వచ్చిన పంటను నేలపాలు చేశాయి. వడగండ్లు వరి కర్రలపై ఒక్క గింజ కూడా లేకుండా చేశాయి. చివరకు రైతన్నకు కడగండ్లే మిగిలాయి. సిరికొండతో పాటు మోపాల్ మండలంలో అకాల వర్షాలు దంచి కొడుతున్నాయి. రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్నడూ లేనంతగా కనివినీ రీతిలో వడగండ్లు భారీ సైజులో పడ్డాయి. ఎండబెట్టిన ధాన్యం భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. రైతుల కష్టాలు చూస్తే గుండె చెరువువతోంది. ఇదీ ప్రస్తుతం జిల్లాలో వరి రైతుల బాధ. – సాక్షి నెట్‌వర్క్



రావుట్లలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



సిరికొండలో ఆరబెట్టిన ధాన్యాన్ని ముంచెత్తిన వరద



మోపాల్: నేల రాలిన ధాన్యం

ఇరవై ఎకరాల పంట పోయింది

నారాయణపల్లెకు చెందిన రైతు తోట గంగారెడ్డి తనకున్న 20 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట కోద్దామనుకున్న ఒక ముందు వడగండ్ల వర్షం కురిసి ఇరవై ఎకరాల్లో పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. రూ.పది లక్షల వరకు వచ్చే ఆదాయం పోవడంతో పాటు పెట్టుబడి రూ. 4 లక్షలు కూడా రాని దుస్థితి నెలకొందన్నారు. వడ్లు పూర్తిగా రాలిపోవడంతో పొలాన్ని కోయకుండా అలాగే వదిలేశానని బోరుమన్నాడు.

– గంగారెడ్డి, రైతు, నారాయణపల్లె, సిరికొండ

ప్రభుత్వమే ఆదుకోవాలి

మోపాల్: నాకు న్యాల్‌కల్ మాసాని చెరువు కట్ట కింద 4 ఎకరాల భూమి ఉంది. అందులో వరి సాగు చేస్తున్నాను. పంట చేతికొచ్చినప్పటికీ వర్షం కురుస్తుండటంతో కోత ఆలస్యమైంది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం నేల రాలింది. చాలావరకు పంట నేలకొరిగింది. వర్షపు నీటిలో మునిగిపోయింది. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఏ అధికారి ఇప్పటి వరకు లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– రామర్తి శేఖర్, రైతు, నిజామాబాద్

నాలుగు ట్రిప్పులు కొట్టుకుపోయాయి

రావుట్లకి చెందిన రైతు అడ్వల భూమయ్య తన పంటను కోసి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ధాన్యాన్ని ఆరబోశారు. ఆకస్మాత్తుగా వర్షం రావడంతో ధాన్యాన్ని కుప్ప చేయలేకపోయాడు. కుటుంబసభ్యులతో కలిసి ధాన్యం కుప్ప చేస్తుండగానే కురిసిన భారీ వర్షానికి పక్కనే ఉన్న ఒర్రెలోకి నాలుగు ట్రిప్పుల ధాన్యం కొట్టుకుపోయింది. 120 సంచులకు పైగానే ధాన్యం నీటి పాలైంది. వడ్లు కొట్టుకుపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లింది.

– భూమయ్య, రైతు, రావుట్ల, సిరికొండ

సమాచారం..

నేటి నుంచి పంచాయతీ సిబ్బంది సమ్మె

సుభాష్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నుంచి కారోబార్లు, పంచాయతీ సిబ్బంది సమ్మె బాటపట్టారు. విధులు బహిష్కరించి మండల కేంద్రాల్లో సమ్మె చేపట్టనున్నారు. జిల్లావ్యాప్తంగా 2720మందికిపైగా కారోబార్లు, పంచాయతీ సిబ్బంది సమ్మెకు వెళ్తుండటంతో గ్రామాల్లో పారిశుద్యం, పన్నుల వసూలు, చెత్త సేకరణ, ఇతరత్ర పనులపై ప్రభావం పడనుంది.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సిరికొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సంగీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



సుభాష్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ బీజేపీ అండగా ఉండి వారి పక్షాన పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు నిజామాబాద్ డివిజన్ నిరవధిక సమ్మెను ప్రారంభించారు. సమ్మెకు ధన్‌పాల్ సూర్యనారాయణ మద్దతు తెలిపి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలన కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారని, ఉద్యోగులు మాత్రం కష్టపడి పని చేస్తే వారి మోచేతికి బెల్లం పెడుతున్నారని విమర్శించారు.

లంచగొండి ఎమ్మెల్యేలను తొలగించాలి



సుభాష్‌నగర్: దళిత బంధు లబ్ధిదారుల నుంచి లంచం తీసుకున్న ఎమ్మెల్యేలను వెంటనే పదవి నుంచి తొలగించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నిజామాబాద్ సౌత్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

యూనిఫాం పంపిణీ

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్మికులకు యూనిఫాంలు నగర మేయర్ దండు నీతూ కిరణ్ గురువారం పంపిణీ చేశారు. యూనిఫాంలు నాణ్యతతో లేకపోవడంతో కార్మికులు మొదట తీసుకోవడానికి నిరాకరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సర్దిచెప్పడంతో ఆ తర్వాత తీసుకున్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రభుదాస్, నటరాజ్, మహిపాల్, ప్రశాంత్, సునీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



నిజామాబాద్ సిటీ: తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని కోరుతూ నిజామాబాద్ రూరల్ మండలం కాలూరు గ్రామ రైతులు గురువారం రోడ్డుపై ధర్నా చేశారు. కాలూర్ చుట్టుపక్కల గల రైస్ మిల్లర్లు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయటం నిలిపివేశారు. దాంతో రైతులు మిల్లర్ల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. విషయం తెలిసి పోలీసులు రైతులతో మాట్లాడి ధర్నాను విరమించాలని కోరారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

సిరికొండ: మండల కేంద్రంతో పాటు న్యావనంది, రావుట్ల, మైలారం తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు సిరికొండ హైస్కూల్లో పెద్ద చెట్టు పడిపోయింది. రోడ్ల వెంబడి చెట్లు పడిపోయాయి. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంటలు కోసిన పొలాల్లో నీళ్లు పూర్తిగా నిండిపోయాయి.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ నేతలు



వరి పైరును పరిశీలిస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్ తదితరులున్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

సిరికొండ: వర్షాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక ఆర్ఐ నాగన్నకు వారు వినతిపత్రం అందజేశారు.

రైతులను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని తాడెం, మోపాల్, తదితర గ్రామాల్లో నేలకొరిగిన వరిపైరు, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైస్‌మిల్ యజమానులతో కుమ్మక్కై రైతుల బతుకులతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.

దళితుల అభ్యున్నతిపై చిత్తశుద్ధి లేదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న నర్సయ్య, ధన్‌పాల్

సుభాష్‌నగర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంటున్నారని, వారి అభ్యున్నతిపై ఆ పార్టీలకు చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. గురువారం నగర పార్టీ కార్యాలయంలో 9వ డివిజన్ బీఆర్ఎస్ దళిత నాయకుడు పవార్ సాయినాథ్, వారి అనుచరులు, మహిళలు పెద్దసంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై అనేకమంది బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా లక్ష్మీనరసింహ కల్యాణం



నిజామాబాద్ సిటీ: నగరంలోని షిర్డీసాయికృపానగర్ లక్ష్మీ నరసింహ ఆలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం లక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి ఆలయం పరిసరాలలో స్వామి వారి రథోత్సవము ఘనంగా నిర్వహించగా, స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ క్యాసం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారం దత్త నిర్మలాశ్రమంలో..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామ శివారు దత్త నిర్మలాశ్రమంలో లక్ష్మీ నరసింహ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వివిధ రంగాల ప్రముఖులు వేడుకలల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో..

డిచ్‌పల్లి: ఖిల్లా డిచ్‌పల్లిలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయధర్మకర్త, ప్రధానార్చకులు వడియాల్ రవికుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

బీఎస్పీ సభ పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే బీఎస్పీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఇంచార్జ్ నీరడి లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ భరోసా పేరుతో సభకు మాయావతి వస్తున్నట్లు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,550	వెండి (కిలో)	77,500
22 క్యారెట్స్	57,550	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	8	క్యాప్సికం	40	60
బెండకాయ	25	50	గాజరుగడ్డ	20	30
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
జిర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	60	గోబిగడ్డ	15	30
వంకాయ	30	50	గోబిపువ్వు	20	40
పాలకూర	40	60	బీట్‌రూట్	30	50
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	50	70
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్‌-1– ఉగ్రం–10.30
విరూపాక్ష –1.15,10.35
రామబాణం –4.30
పొన్నియిన్ సెల్వన్‌-2– 7.25

స్క్రీన్‌-2– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ– 10.30 ,10.20
పొన్నియిన్ సెల్వన్‌-2 –1.30
ఉగ్రం –4.40,7.25

స్క్రీన్‌-3 –రామబాణం–10.30,7.30,10.30
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ–1.20,4.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్‌-1– గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ(ఇంగ్లిష్) 3.15,6.30,9.45

స్క్రీన్‌-2– ఉగ్రం–10.00,4.15,10.30
రామబాణం –1.10,7.25

స్క్రీన్‌-3–ది కేరళ స్టోరీ(హిందీ),10.00,1.00 4.00,7.00,10.00

స్క్రీన్‌-4– ఇంగ్లిష్ మంజు(తెలుగు) 10.00
యాదగిరి అండ్ సన్స్–1.25
అరంగేట్రం–4.00
పొన్నియిన్ సెల్వన్‌-2,6.50 ,10.20

దేవి – పొన్నియన్ సెల్వన్ 2
నటరాజ్ – ఉగ్రం
లలితామహల్ – రామబాణం
విజయ్ – విరూపాక్ష

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899